అర్జీదారుల సమస్యలు వేగంగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధితాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని పేర్కొన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా అప్పటికప్పుడే పరిష్కరించాలని సూచించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జెసి అదితి సింగ్, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ శ్రీనివాసులు, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నిరాశే!

రాష్ట్రబడ్జెట్-2024-25 బడ్జెట్ తీవ్ర నిరాశను కలిగించింది. జిల్లా ప్రగతికి కీలక రంగాలైన నీటిపారుదల, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాల పురోభివృద్ధికి అవసరమైన కేటాయింపుల్లో స్పష్టత కొరవడింది. ఇందులో రూ.3,848 కోట్లతో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు ఉప శమనం కలిగించడం మినహా వ్యవసాయ పారిశ్రామిక కేటాయింపులు నిరాశను మిగిల్చాయని చెప్పవచ్చు. జిల్లా జీవనాడిగా పరిగణ పొందిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కొప్పర్తి ఎంఎస్ఎంఇల పురోగతికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన చేయక పోవడం విస్మయాన్ని కలిగించింది. వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో పరిశ్ర మల ఏర్పాటుకు మౌళిక సదుపాయాల కల్పన విస్మరించింది. వ్యవసాయం, సాగునీటి పారుదల, పారిశ్రామిక రంగాలకు నాలుగు నెలలకు సంబంధించిన ఫీజు రియింబర్స్‌మెంట్, తల్లికి వందనం తదితర పథకాల వ్యయాల్ని సైతం నిర్లక్ష్యం చేసినట్లు కనిపిస్తోంది.

- ◆ 'ఉక్కు' ప్రస్తావనే కరువు
- ◆ ఎంఎస్ఎంఇ పార్కు గల్లంతు
- ◆ రూ.2,254 కోట్లతో జిఎన్ఎస్ఎస్ పనులు
- ◆ రూ.305 కోట్లతో పిబిసి కెనాల్ కేటాయింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం రూ.2,94, 425 కోట్లతో 2024-25 బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. జిల్లాకు సంబంధించిన కీలక రంగాల కేటాయింపులను పరిశీలిస్తే తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించింది. సాగునీటి రంగ కేటాయింపులను హంద్రీ-నీవా, తుంగభద్ర హైలెవల్ కెనాల్, వెలుగొండ ప్రాజెక్టుల ప్రస్తావనతో సరిపెట్టింది. జిఎన్ఎస్-ఎస్ ఫేజ్-2, నిలిచిపోయిన పెన్నా-కుందూ ఎత్తిపోతలు, వెలిగల్లు ఎత్తిపోతల, రురుటిపోత ప్రాజెక్టు పనుల ప్రస్తావన కనిపించలేదు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు ముడిపడిన జిఎన్ ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్, కెసికెనాల్ కేటాయింపులు చేయకపోవడం ఆందోళన కలిగించింది. నాలుగు నెలల స్వల్పకాలిక బడ్జెట్ ఆయినప్పటికీ ప్రాధాన్య, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు కేటాయింపులప్రస్తావన లేకపోవడం విస్మయాన్ని కలిగించింది. 2023-24 బడ్జెట్‌లో సాగునీటి పారుదల రంగానికి రూ.1542.17 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. తాజా బడ్జెట్‌లో ఏమేరకు కేటాయించారనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. 2022-23 బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రూ.2,200 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే చేయలేదు. 2022-23 బడ్జెట్‌లో యోగివేమన యూనివర్శిటీకి రూ.32.83 కోట్లు, సిపిబ్రౌన్‌కు రూ.10 లక్షల చొప్పున కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత బడ్జెట్‌లో యోగి వేమన, ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ, ఎపి కార్ల్ విద్యా, పరిశోధక సంస్థల ప్రస్తావన కనిపించలేదు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.4,500 కోట్లు సున్నావడ్డీ పథకానికి రూ. 687 కోట్లు కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలోని 4.80 లక్షల మంది రైతులకు స్వల్ప ఊరట లభించింది. ఇదిలాఉండగా రాష్ట్రంలోని యువతకు ఉద్యోగావకా శాల కల్పనలో స్పోర్ట్స్ కోటా కింద మూడు శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా యువతను ప్రసన్నం చేసు కునే ప్రయత్నం చేసినట్లు కనిపించింది. ఉమ్మడి జిల్లాలోని గండికోట డిస్ట్రిబ్యూటరీలు, అన్నమయ్య పునరుద్ధరణ, పింఛా, ఎల్ఎస్‌పి, నిలిచిపోయిన కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పథకాల పనులకు సంబంధించిన కేటాయింపుల ప్రస్తావన చేయకపోవడం విస్మయాన్ని కలిగించింది.

పిట్టల దొర ప్రసంగం..

అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన బడ్జెట్ ప్రసంగం పిట్టల దొర ప్రసంగాన్ని మించి పోయింది. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం చూస్తే 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో రూ 2.94 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు.మిగతా రూ 1.46 లక్షల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారో తెలియడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి అంత అప్పు చేసేం దుకు నిబంధనలు ఒప్పుకోవు. మరి ఎలా రూ 2.94 లక్షల కోట్లు ఖర్చు చేస్తారో చూడాలి. కూటమి ప్రభుత్వ బడ్జెట్ ప్రసంగం పిట్టల దొర ప్రసంగమే కాని అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ కు విశ్వసనీయత లేదని తులసిరెడ్డి అన్నారు.

- ఎన్.తులసిరెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి.

విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు 9.8శాతం మాత్రమే కేటాయించింది. గత బడ్జెట్లతో పోల్చితే చాలా తక్కువగా ఉంది. ఈ నిధులు ప్రభుత్వ విద్యా రంగాభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడవు. కొఠారి కమిషన్ సిఫార్సులు దరిదాపుల్లో కూడా ఈ బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం శోచనీయం. గత ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధిని విస్మరించిందనడానికి ఈ బడ్జెట్ కేటాయింపులే నిదర్శనం.

- లక్ష్మీరాజా, పాలెం మహేష్‌బాబు, యుటిఎఫ్ నాయకులు

దార్శనిక బడ్జెట్‌గా చూడవచ్చు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్ దార్శనికంగా చూడవచ్చు. విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో భాగంగా 2014-19 మధ్యకాలంలో అభివృద్ధి పునాదులను వేశారు. 2019-24 బడ్జెట్ సర్వనాశనం చేసే విధంగా పరిపాలన సాగింది. ఇచ్చిన హామీలు అమలుకు అవసరమైన నిధులు కేటాయించడం హర్షణీయం.

- ఆర్.శ్రీనివాసరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు, కడప.

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త 'వర్రా' అరెస్టు

చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్ నుంచి కోర్టుకు తరలింపు

నా భర్త అరెస్టు సమాచారాన్ని ఇవ్వలేదు : కల్యాణి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. అతనితోపాటు సుబ్బారెడ్డి, ఉదయ్ అనే మరో ఇద్దరు అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి ప్రకాశం జిల్లా మార్కాపురంలో కుంట ఆత్మకూరుకు వెళ్లే మార్గంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సోమవారం తెల్లవారుజమున కడప జిల్లాలోని చింతకొమ్మదిన్నె పోలీ స్టేషన్‌కు తరలించారు. కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ కడపకు వచ్చే వరకు విచారించిన అనంతరం సాయంత్రం 4.30 గంటలకు మీడియా ఎదుట హాజరు పరిచారు. అనంతరం కోర్టుకు హాజరుపరిచారు. ఇదిలాఉండగా ఈనెల 5న సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ పవన్‌కల్యాణ్, హోం మంత్రి అనిత, వైఎస్ షర్మిల, వైఎస్ విజయమ్మ, వైఎస్ సునీత, మంద కృష్ణ మాదిగ తదితర నాయకుల మీదు అనుచిత పోస్టులు పెట్టారనే పలు ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. 41(ఎ) నోటీసులు పేరుతో తప్పించుకున్న నేపథ్యంలో ఐదారు రోజులపాటు కర్నూలు, తెలంగాణా సరిహద్దు జిల్లాయైన మహబూబ్‌నగర్‌లో ఈనెల 5న సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు నమోదు చేశారు. ఫిర్యాదుల ఆధారంగా అదుపులోకి తీసుకున్న సందర్భంగా తప్పించుకున్న సంగతి తెలిసిందే. సుమారు వారం రోజులపాటు తెలంగాణా సరిహద్దు ప్రాంతమైన మహబూబ్‌నగర్, రాష్ట్రంలోని కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో గాలింపును పోలీసులు ముమ్మరం చేశారు. లోతైన విచారణ అనంతరం సేకరించిన సమాచారం ఆధారంగా ప్రకాశం జిల్లాలో ఉన్నట్లు గుర్తించి పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని సోమవారం సాయంత్రం 4.30 గంటలకు మీడియా ఎదుట హాజరు పరిచా మని డిఐజి కోయ ప్రవీణ్, కడప ఇన్‌ఛార్జి ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. నిందితునిపై సింహాద్రిపురానికి చెందిన దళితుని ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీస్టేషన్‌లో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా రవీం ద్రరెడ్డి భార్య, సోదరులు అరెస్టు చేసిన సమాచారం తెలుసుకుని చింతకొమ్మదిన్నె పోలీస్టేషన్ చేరుకుని నిరీక్షించారు. తమతో మాట్లాడనివ్వకుండానే తరలించడం దారుణమని వాపోయారు. అనంతరం వర్రా రవీంద్రరెడ్డి భార్య కల్యాణి మాట్లాడుతూ తన భర్తను ఈనెల ఐదున అదుపులోకి తీసుకుని ఎక్కడెక్కడో తిప్పి వేధించారని వాపోయారు. నాభర్త ప్రాణానికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. సోదరుడు మల్లికార్జునరెడ్డి మాట్లా డుతూ సోదరుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు సమాచారం ఇవ్వలేదన్నారు. మీడియా ద్వారా తెలు సుకుని వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు సోదరునిపై కేసులు లేవని, ఇప్పటికిప్పుడు కొత్తగా కేసులు ఎలా పుట్టుకొచ్చాయో అర్థం కావడం లేదన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు

- కర్నూల్ రేంజి డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి కోయ ప్రవీణ్

కొందరు ప్రముఖులు వ్యవస్థగా ఏర్పడి అసాంఘిక శక్తులతో పనిచేస్తూ తాడేపల్లి కేంద్రంగా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడ్డారని కర్నూల్ రేంజి డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీందర్‌రెడ్డి, నేరస్థుడని తెలిసి ఆశ్రయం కల్పించిన మరో ఇద్దరు వెంకట సుబ్బారెడ్డి, అలియాస్ సుబ్బారెడ్డి, ఉదయ కుమార్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సోమవారం డిపిఒలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముగ్గురు నిందితులను మీడియా ముందు హాజరుపరచారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం, వేముల మండలం, కొంద్రెడ్డి పల్లి గ్రామానికి చెందిన వర్రా రవీందర్‌రెడ్డి ఏడేళ్లుగా సంవత్సరాల నుంచి వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సోషయల్ మీడియా ద్వారా వైసిపి వ్యతిరేకులైన వివిధ పార్టీల నాయకులు, మహిళలపై అబద్ధపు, అశ్లీల మార్ఫింగ్ ఫోటోలు, కంటెంట్ పెడుతూ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించాడని తెలిపారు. దీనివల్ల వివిధ కులాలు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి సమాజంలో అశాంతిని, శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తున్నాడని తెలిపారు. ఈ నెల 8న పులివెందల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌సి వర్గానికి చెందిన హరి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు కడప జిల్లా ఇన్‌ఛార్జీ ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్‌పి పి.మురళీనాయక్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. దర్యాప్తులో భాగంగా వర్రా రవీందర్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు 3 బృందాలు రంగంలోకి దిగాయని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో వర్రా ఆచూకీ కోసం గాలిస్తుండగా ఈ నెల 10న రాత్రి 11.35 గంటలకు ప్రకాశం జిల్లాలోని కుంట-ఆత్మకూరు పోవు రహదారిలో జమ్మలమడుగు అర్బన్ సిఐ లింగప్ప ఆధ్వర్యంలో బృందం వాహన తనిఖీలు చేస్తుండగా వర్రా, అశ్రయమిచ్చిన మరో ఇద్దరు ప్రయాణిస్తున్న కారును, వారిని పట్టుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కుటుంబ సభ్యులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, కుటుంబ సభ్యులు, టిడిపి మహిళా నేతలే లక్ష్యంగా వికృతచేష్టలు ప్రళయతాడవం చేసేవారన్నారు. వర్రా రవీందర్‌రెడ్డి వివరాలు పరిశీలిస్తే..ఇతను భారతీ సిమెంట్‌లో ఉద్యోగి అన్నారు. 2019లో ఉద్యోగం మానేసి పూర్తిస్థాయి వైసిపి కార్యకర్త కింద సోషల్ వీడియా వింగ్‌లో జిల్లా కన్వీనర్ వివేకర్‌రెడ్డి కింద కో-కన్వీనర్‌గా పని చేసేవాడని పేర్కొన్నారు. 2020లో ఎపి డిజిటల్ కార్పొరేషన్ అని ప్రభుత్వ రంగ సంస్థ అప్పటి ప్రభుత్వ చిన్నవాసుదేవరెడ్డి మీడియా చానల్ యజమాని కింద పని చేసేదని తెలిపారు. కోవిడ్ సమయంలో సజ్జల భార్గవ రెడ్డి ఆరంగేట్ చేసి సోషల్ మీడియా వ్యవస్థను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి సజ్జల భార్గవ్ బూతుపురాణాలు మొదలుపెట్టారని చెప్పారు. 45 మందిని వీరి ముఠాలో గుర్తించామని తెలిపారు. వీరిపై సైబర్‌క్రైం రిలేటెడ్ సెక్షన్‌ల కింద కేసుపెట్టామని తెలిపారు. అవినాష్‌రెడ్డి పిఎ బండి రాఘవరెడ్డికి ఆయన వాట్సప్ నంబరు ద్వారా కంటెంట్ ఇస్తారని తెలిపారు. సమావేశంలో ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, ఎఎస్‌పి సత్యప్రకాష్, కడప, పులివెందుల డిఎస్‌పిలు వెంకటేశ్వర్లు, మురళీ నాయక్ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం అబుల్ కలాం ఆజాద్

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

స్వాతంత్ర్య సమరయోధులు , భారత తొలి విద్యాశాఖ మంత్రి 'మౌలానా అబుల్ కలాం ఆజాద్' అసమాన విద్యావేత్తతో పాటు గొప్ప పరిపాలకుడని, ఈ తరం యువతకు ఆదర్శనీయుడని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల హాలులో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి వేడుకలను పురస్కరించుకొని అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యసంగ్రామంలో గాంధీ, నెహ్రూలతో చురుగ్గా మౌలానా అబుల్ కలాం పాల్గొన్నారని తెలిపారు. అరబిక్, పర్షియన్, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో ఆయన నిష్ణాతులని పేర్కొన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్,అఖిల భారత విద్యా కౌన్సిల్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఢిల్లీ యూనివర్సిటీలను అబుల్ కలాం ఆజాద్ స్థాపించారని గుర్తుచేసారు. అబుల్ కలాం ఆజాద్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను మంచి ఆశయాలతో పెంచాలన్నారు.పిల్లలే రేపటి తరం భవిష్యత్తని..

ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

అందరూ బాగా చదువుకోవాలని, గొప్పవారు కావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ ఇమ్రాన్, ఆల్ మేవ చైర్మన్ ఫరూక్, మాజీ ఉర్దూ అకాడమి చైర్మన్ షేక్ జీలాన్,మక్దూమ్ బుకారి,సలావుద్దీన్, మన్సూర్ అలీ ఖాన్,సామ్యేలు,ఇతర మైనార్టీ నాయకులు, మన్సూర్ నాయకులు, ఇతర మత పెద్దలు,విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యంత కీలకం భూగర్భ జల అధ్యయనం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్ :భూగర్భ జల అధ్యయనానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో 3 రోజుల పాటు నిర్వహించబోయే 'భూగర్భ నీటి వనరుల సుస్థిరత-నిర్వహణ'పై శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాను రాను వర్షపాతం తగ్గుతోందని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఇప్పుడు ఆలోచించకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి, భూగర్భ జల శాఖ సిబ్బంది, వై వి యు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన విజయనగరం, నెల్లూరు జట్ల మ్యాచ్

ప్రజాశక్తి - కడప : ఎసిఎ అండర్- 14 గ్రూప్ -బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నెల్లూరు, విజయనగరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో విజయనగరం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 260 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 84.0 ఓవర్లలో 260 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని లీల వికాస్ 79, సాయి యశ్వంత్ 62, కిన్ను కిషల్ 52 పరుగులు చేశారు. విజయనగరం జట్టులోని సాత్విక్ మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 12.0 ఓవర్లలో నాలుగు వికెట్లను నష్టానికి 69 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కడప అర్బన్ : మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కాలేజీ, కేకేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ షేక్. నజిముద్దిన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసి మానవత్వాన్ని ప్రదర్శించారని కొనియాడారు. రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కెకెఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎం.తారిక్ అలీ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ విలయత్ అలి, భైగ్,కో- ఆర్డినేటర్ డాక్టర్ హకిముద్దిన్, కన్వీనర్ మొహమ్మద్ సికందర్ హుస్సేన్, అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న ట్రస్ట్ చైర్మన్

ఐలమ్మ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు : మున్సిపాలిటీ పరిధిలోని ఐలమ్మ కాలనీలో వీధిలైట్లు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పట్టణ నాయకులు ముడియం చిన్ని పేర్కొన్నారు. సోమవారం ఐలమ్మ కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని ఐలమ్మ కాలనీలో దాదాపు 500 కుటుంబాలు నివాసముంటున్నాయని, వీధిలైట్లు లేక నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు రాత్రుళ్లు ఇళ్లనుంచి బయటకు రావాలంటే విషపురుగులతో భయపడుతున్నారని, మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ తాము కొత్త వీధిలైట్ల కోసం బడ్జెట్ కేటాయించి వారం లోపు వాటిని తెప్పించిన వెంటనే మొదటిగా ఐలమ్మ కాలనీకి వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐలమ్మ కాలనీ శాఖ కార్యదర్శి మస్తాన్ బి, పట్టణ నాయకులు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఎస్ కే ఆదిల్, బాల గురయ్యా, షబ్బీర్, ఓబుల్ రెడ్డి, బాలయ్య తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతలను పూడ్చాలి

ప్రజాశక్తి - కడప : బుడగ జంగం కాలనీ, లోహియా నగర్ ప్రాంతాలలో ప్రమాదకర గుంతలను తొలగించాలని 48వ డివిజన్ కృపా కాలనీకి చెందిన న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి. మహేష్, బుడగ జంగం నాయకులు డి. రాజు సోమవారం కడప నగరపాలక సంస్థ కమిషనర్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆయనకు సమస్యలను వివరించారు. రామరాజుపల్లి పరిధిలోని కృపా కాలనీ, బుడగజంగం కాలనీ, లోహియా నగర్ ఈ ప్రాంత పేద ప్రజలు డ్రెయినేజీతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. స్పందించిన కమిషనర్ తక్షణమే ప్రమాదకరంగా గుంతలను తొలగించి, ఆక్రమణకు గురైన రొడ్డును విస్తీర్ణం చేసి డ్రెయినేజీ కాలువ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం నగర ఉపాధ్యక్షులు పి.రవితేజ, సిస్టర్ శాంతమ్మ, బేడ బుడగజంగం జిల్లా అధ్యక్షులు డి.రాజు, డి.శ్రీరాములు, విద్యార్థులు శాంతిరాజు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - కడప: ఆధార్ నమోదు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే సర్వీసు ఛార్జీలను చెల్లించాలని, అదనపు చార్జీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆధార్ సేవల నిర్వహణపై సోమవారం జెసి అదితి సింగ్, అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్‌డిఒలు జిల్లాలోని పలు ఆధార్ సేవ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఆధార్ సేవాకేంద్రాల్లో ఆపరేటర్లు సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఆధార్ నమోదు లేక వివరాల అప్ డేట్ కోసం వచ్చే ప్రజలు తమ వెంట సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని వస్తే స్కాన్ చేసి వాటిని తిరిగి ఇస్తారని తెలిపారు.

నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజలపై విద్యుత్ భారం అన్యాయం

- విద్యుత్ భవన్ ఎదుట లాంతర్లతో కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - కడప

వినియోగదారులపై ఇంధన, కొనుగోలు ఛార్జీల పెంపు అన్యాయం అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి పేర్కొన్నారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కడపలోని పార్టీ కార్యాలయం నుంచి మహావీర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవన్ వద్ద లాంతర్లతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ ఛార్జీలతో ప్రజలు అంధకారంలో బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది అన్నారు. ఇక ప్రతి ఒక్కరూ లాంతర్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. వైసిపి హయాంలో రూ.35వేల కోట్లు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేశారు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా 5 నెలల్లోనే రూ.17వేల కోట్లు భారం మోపుతోంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే గత ప్రభుత్వం తప్పు చేస్తే భారం ప్రజలపై ఎందు వేస్తారని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు అధికమయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఏకంగా సర్దుబాటు ఛార్జీల పేరుతో 40 శాతం అధికంగా వసూలు చేస్తున్నారు అని ఆరోపించారు. వెంటనే విద్యుత్ భారాన్ని తగ్గించాలని లేకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి అలీ ఖాన్ , పిసిసి మాజీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ సలావుద్దీన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, గౌస్ పీర్, సిరాజుద్దీన్, బాబ్జి పాల్గొన్నారు.

సమస్యలను డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావాలి

ప్రజాశక్తి - కడప : ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావచ్చునని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరంలోని హెలెన్ కిల్లర్ ప్రత్యేక పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆడియో మెట్రిషన్ టెస్టులు నిర్వహించి వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. కడప నగరంలో గల పురుషుల, మహిళ కేంద్రకారాగారాలను సందర్శించారు. అక్కడున్న లీగల్ ఎయిడ్ క్లినిక్లను కూడా ఆయన సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయము, న్యాయ సహాయము రక్షణ సలహా వ్యవస్థ, పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు వహించాలి, మందులను సక్రమంగా వాడాలి, భోజనం సదుపాయాలు పరిశీలించారు.

బినామీ ఓట్లను తొలగించాలని వినతి

ప్రజాశక్తి-కాశినాయన : నీటి సంఘం ఎన్నికలలో మండల పరిధిలోని శావిశెట్టిపల్లి చెరువు ఆయకట్టు కింద బినామీ ఓట్లు చేర్చారని వాటిని విచారణ చేసి తొలగించాలని సిపిఎం నాయకులు వెంబడి పోలయ్య సోమవారం తహశీల్దార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శావిశెట్టిపల్లె చెరువు కింద భూమి లేకున్నా ఉన్నట్లుగా ఓట్లు నమోదు చేశారని పేర్కొన్నారు. వాటిపై వెంటనే విచారించి నిజమైన ఓట్లను ఉంచి బినామి తొలగించాలని తెలిపారు. విచారణ చేయకపోతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు

డబ్బులు వెనక్కి తీసుకోవడం సరికాదు

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్వాడీ సెంటర్ల అవసరాల కోసం ఇచ్చిన డబ్బులు వెనక్కి తీసుకోవడం సరికాదని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ పేర్కొన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన వస్తువులు ప్రభుత్వ భవవనం ఉన్నవారికి ఒక్కొక్కరికి రూ. 3 వేల చొప్పున చొప్పున విడుదల చేసిందని తెలిపారు. ఆ సెంటర్ల అవసరాలతో నిమిత్తం లేకుండా జిల్లాలోని ఐసిడిఎస్ అధికారులు మ్యాట్, గ్యాస్ స్టవ్, మార్కర్, బోర్డు, చైర్ సరఫరా చేసి, రూ.3000 వెనక్కి తీసుకోవడం దారుణమని చెప్పారు. వీటిపైన విచారణ చేసి బాధ్యులైన పీడీపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒక్కొక్క సెంటర్‌లో ఒక్కొక్క అవసరం ఉంటుందని తెలిపారు. అంగన్వాడీలపై బెదిరింపులు, మెమోలు, పర్యవేక్షణలు, తనిఖీలు చేస్తూ తీవ్రమైన ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితి ఎక్కడ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని అడిగితే మరుసటి రోజే కక్ష కట్టి ఆ సెంటర్లకు వెళ్తారని తెలిపారు. జిల్లాలో రూ.30 లక్షల పైగా వచ్చిందని తెలిపారు. దీని బట్టి చూస్తే ఆ వస్తువులు రూ.2000 కూడా విలువ చేయవని పేర్కొన్నారు. కనుక వీటిపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జెసి మాట్లాడుతూ అవసరాలు లేనేవి సరఫరా చేయడం ఏమిటని అడిగారు. వీటిని వెంటనే పరిశీలన చేయాలని సంబంధితాధికారులను ఆదేశించారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-అట్లూరు : మండలం పరిధిలోని నల్లా యపల్లె సర్వేనెంబర్ 40, తంబలగంది సర్వే నంబర్ 146. 146/ బిలలో ఉన్న ప్రభుత్వ భూ ములను స్థానిక పేదలకే పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రమణ, సిపిఎం నాయకులు పి. చాంద్‌బాషా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశలీల్దార్ శిరీషకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు పదేళ్లుగా ఇంటి స్థలాలు, సాగు భూములు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే ఆగమేఘాలపై వచ్చి కూల్చివేసే రెవెన్యూ అధికారులు, బడా కబ్జాదారులు ఎకరాలు ఆక్రమించుకుని అనుభవిస్తుంటే చూసీ చూడనట్లు వ్యహరించడం సరైందని కాదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం నాయకులు రవిచంద్ర ,గంగయ్య, తిరుపాల్రెడ్డి , సుబ్బరాయుడు, ప్రశాంత్, స్వప్న, రామసుబ్బమ్మ ,లక్ష్మీదేవి, ప్రజలు పాల్గొన్నారు.

స్నానాల ఘాట్ ప్రారంభం

ప్రజాశక్తి - గోపవరం: వంకెలి పోలిరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో బద్వేలు - సిద్ధవటం రోడ్డు సగిలేరు ఒడ్డున నూతనంగా నిర్మించిన స్నానాల ఘాట్‌ను ఎమ్మెల్సీ డి.సి గోవిం దరెడ్డి సోమవారం ప్రారం భించారు. అనంతరం మొక్కలు నాటారు. అక్కడికి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కూడా మాజీ చైర్మన్ సింగసాని గురు మోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ, మున్సిపల్ పట్టణ అధ్యక్షులు సుందర్ రామిరెడ్డి, ఎంపిపి రామ సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి పోలిరెడ్డి, బాల మునిరెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్ బాబు, వీరారెడ్డి, శ్రీనివాసులు, రఘురాం రెడ్డి, నారాయణరెడ్డి (బాబు) జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి, నారాయణ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ పిఎపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్. అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికే పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురానికి చెందిన కొండప్పగారి హరి అనే వ్యక్తిని కులం పేరుతో వ్యక్తిగతంగా దూషించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు వైసిపి సామాజిక మాధ్యమాల కన్వీనర్ సజ్జల భార్గవ్ రెడ్డి, కార్యకర్తలు వరా రవీంద్రారెడ్డి, అర్జున్ రెడ్డిపై ఇప్పటికే కేసు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా ఇదే కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి, మరో వైసిపి కార్యకర్త వివేకానంద రెడ్డిపైనా ఆదివారం రాత్రి పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశారు.

ప్రజలతో మాట్లాడుతున్న తహాశీల్దార్ వరదకిషోర్ రెడ్డి

ఆధార్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి తెలిపారు. ఉప్పలూరు సచివాలయంలోని ఆధార్ కేంద్రాన్ని సోమవారం తహాశీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆధార్ నమోదు, వేలిముద్రలు, పుట్టినరోజు, పేరు, ఐరిష్, ఫోన్ నెంబర్ అప్డేట్ చేసుకోవచ్చన్నారు. ప్రజలకు సకాలంలో ఆధార్ సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా యువ ఉత్సవ్ గోడపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

జిల్లాస్థాయి యువ ఉత్సవాల్లో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర మైదుకూరు అధికారి శివశంకర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు గోడపత్రాలను ఆవిష్కరించారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యోగి వేమన విశ్వవిద్యాలయం కడపలో ఈనెల 16న జరిగే యువ ఉస్తావ్ ఇండియా ఎ-2047 అనే అంశంపై పెయింటింగ్, కవిత్వం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమషన్ విభాగాల్లో వ్యక్తిగత పోటీలు కల్చరల్ ట్రెడిషనల్, ఫోక్, సైన్స్ ఎగ్జిబిషన్ మేళా పోటీల్లో గ్రూప్, వ్యక్తిగత పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలో జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి, రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు ఉంటాయన్నారు. మైదుకూరు పట్టణ పరిసర ప్రాంత యువత ఈ పోటీలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. మైదుకూరులోని వివిధ డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శుభాన్ సాహెబ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13న గురుకుంట కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురజాల సమీపంలో వెలిసిన గురుకుంట క్షేత్రంలో గురుకుంట కల్యాణ మండపాన్ని ఈనెల 13న ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్ని రకాల వసతులతో, అందంగా కల్యాణ మండపం నిర్మించామన్నారు. మండపాన్ని దొరసాని వెంకటేశ్వరరెడ్డి, గ్రామ ప్రజల సహకారంతో దాదాపు 800 మందికి సరిపోయేలా తీర్చిదిద్దామన్నారు. ప్రారంభోత్సవ అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - తొండూరు

ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లేవారు దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ పెద్ద ఓబన్న పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించి తమ సూచనలు పాటిం చాలని ఎస్ఐ పేర్కొన్నారు. డబ్బు, విలువైన ఆభరణాలు ఇంట్లో ఉంచి వెళ్లకూడదన్నారు. రాత్రివేళ అనుమానంగా సంచరించేవారి గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. తాళం వేసిన ఇళ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతికినట్లు కనిపిస్తే అప్రమత్తం కావాలన్నారు. ఇరుగుపొరుగు వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిదన్నారు. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ఖరీదైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్తవారి కదలికలపై, అనుమానితుల సమాచారమిచ్చి దొంగతనాల నివారణకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

ఎస్ఐ పెద్ద ఓబన్న

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ తెలిపారు. సోమవారం స్కానింగ్ సెంటర్స్ ఉన్న ప్రయివేట్ ఆస్పత్రులను ఆమె తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సాయి నర్సింగ్ హెూమ్, కాంబెల్ ఆసుపత్రిలో ఉన్న డాక్టర్లకు పలు సూచనలు చేశారు. బిడ్డ ఎదుగుదల, లోపాలను గుర్తించడానికి మాత్రమే స్కానింగ్‌ను ఉపయోగించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, డాక్టర్ సర్టిఫికెట్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. లింగ నిర్ధారణ చేసిన స్కానింగ్ సెంటర్‌కు రూ.50వేలు జరిమానా విధిస్తామన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థుల కోసం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, చెరుకూరి శ్రీనువాసులు కోరారు. ఆ మేరకు వారు సోమవారం ఎంపిడిఒ కుళాయమ్మకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అపార్‌కు సంబంధించి అన్‌లైన్‌లో సరి దిద్దు కోవడానికి ఇబ్బందిగా మారిందన్నారు. అపార్ అన్‌లైన్ సేవలు వేగ వంతంగా జరగడం లేదని తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన తప్పులను సరిదిద్దుకోవడానికి ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఉప యోగకరంగా ఉంటుందని వివరించారు. బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు ఎంపిడిఒ కుళా యమ్మ స్పందిస్తూ ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుకు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఎంపిడిఒకు వినతిపత్రమిస్తున్న హెచ్‌ఎంలు

రాజశ్రీ శాశ్వత లోక్ అదాలత్ జడ్జి వారి కోర్టులో

PLAC No. 16/2024

షేక్ హుస్సేన్ బీ, W/o షేక్ కమాల్‌బాషా, వయస్సు 52 సం॥లు, డోర్‌నెం.1/1242, ఎర్రముక్కపల్లి, కడప.

...వాది/పిటిషనర్

Vs

ది నయాజీవన్ కోఆపరేటివ్, హౌసింగ్ బిల్డింగ్ సొసైటి, కడప, O/o ఎ.పి.కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్, రీజనల్ ఆఫీస్, H/No.20/1002, కోఆపరేటివ్ కాలనీ, కడప.

...ప్రతివాది

ప్రతివాది అయిన మీ పై పిటిషనరు/వాది రాజశ్రీ పై కోర్టులో కేసును వేసియున్నారు. కేసు వాయిదా 21.11.2024వ తేదీన ఉన్నది. మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ తరపున ఏదైనా ఆక్షేపణలు ఉంటే తెలుపవలెను. లేనియెడల మీ పైన పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the Court//

సి.హెచ్.కె.మోజెస్ జాషువా
పి.సుధారాణి
న్యాయవాదులు, కడప.

PUBLIC NOTICE

Under instructions from my client Sri Kalluri Gangaiah son of Venkata Subbaiah, resident of D.No. 81/174, Palempalli village of Kadapa Mandal, Kadapa District I give you the following General public notice.

While in the year 2018 my client shifting his family from Palempalli, he lost the Document No. 2134 /2010 dated 16-10- 2010 which stands in the name of his mother who got purchased the same from Kalluru Veeramma wife of Venkata Subbaiah. If anyone found the said document, inform either to my client or to the below mentioned address within ONE WEEK.

B. OBULESU
Advocate,
H.No.45/85, Chemmumiahpeta,
Kadapa
Mobile No.83097 69833

రోడ్లు గుంతలమయం.. నరక ప్రయాణం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ప్రధాన రహదారులలు గుంతలమయం కావడంతో.. ప్రయాణం నరకంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కడప-పులివెందుల ప్రధాన రహదారుల్లో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగు అడుగునా రోడ్డు అంతా గుంతలమయం.. వాహనాల్లో వెళ్లే ప్రయాణికులు ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై మరింత గుంతలు పడడంతో వాహనాలు కూడా గుంతల్లో పడి షెడ్లకు వెళుతున్నాయి. రాత్రి పూట మోటర్ బైకుల్లో ప్రయాణం చేసే వారికి గుంతలు కనపడకపోవడంతో కిందపడి రక్త గాయాలవుతున్న సంఘటనలున్నాయి. గుంతల పడ్డ రోడ్డును మరమ్మతులు చేపట్టకుండా రోడ్డు భవనాల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. కడప-పులివెందుల రహదారిలో గుంతలు ఉన్న చోట్ల రాళ్లను పెట్టారు. ప్రధాన రహదారిలోనే పెద్ద పెద్ద గుంతలు ఉన్న విషయం సంబంధిత అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిసినా పట్టించుకోకపోవడం దారుణమని పలువురు అంటున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. గుంతల్లో పడిన వాహనాలకు ఖర్చు చేసుకొనే పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి కడప-పులివెందుల ప్రధాన రహదారిలో ఉన్న గుంతలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కడప రోడ్డులోని ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలు

మౌలానా ఆజాద్ ఆదర్శనీయుడు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప

మౌలానా ఆజాద్ అందరికీ ఆదర్శనీయుడని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ ఖాన్, పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, బండి జకరయ్య, అబ్దుల్ సత్తార్, బ్రహ్మానందరెడ్డి, సంజయ్ కాంత, శ్యామలమ్మ, సిరాజుద్దీన్, మల్లెం విజయభాస్కర్, మహబూబ్ బాషా (మాస్), కదిరి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యాలయంలో..

కడప జిల్లా వైసిపి జిల్లా కార్యాలయంలో సోమవారం భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జమల్ వలి, కార్పొరేటర్లు మొహమ్మద్ షఫీ, రామ్ లక్ష్మణ్‌రెడ్డి, త్యాగరాజు, బండి ప్రసాద్, చెన్నయ్య, సుదర్శన్‌రెడ్డి, మాజీ టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య, నాయకులు పులి సునీల్ కుమార్, దాసరి శివచంద్ర, జయచంద్రారెడ్డి, దేవిరెడ్డి ఆదిత్య, టిపి వెంకట సుబ్బమ్మ, పత్తి రాజేశ్వరి, ఉమా మహేశ్వరి, నారాయణమ్మ, తులసమ్మ పాల్గొన్నారు.

'ఎస్‌వి'లో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

కడప సిటీ : స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో భారతరత్న గ్రహీత శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వీర సుదర్శనరెడ్డి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ మన దేశానికి చేసిన సేవలను ముఖ్యంగా మన దేశ విద్యా విధానంలో తీసుకువచ్చిన సంస్కరణలను గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి ఆయన కలలను నెరవేర్చే దిశలో కృషి చేసే భావి భారత పౌరులు కావాలని కోరారు. ప్రతి విద్యార్థీ విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం కూడా పాల్గొన్నారు.

వేంపల్లె : మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం, స్ఫూర్తిదాయకమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆజాద్ 126వ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

విద్యాశాఖ అభివృద్ధికి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఎనలేని కృషి చేశారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి కళాశాల అధ్యాపకులు నివా ళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, డాక్టర్ నాగలక్ష్మి దేవి, డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ సతీష్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ రామకృష్ణ, షఫీవుద్దీన్, అరవింద్, రాజారెడ్డి, జనార్దన్, పీడీ తేజేంద్ర పాల్గొన్నారు.

మైదుకూరు(చాపాడు) : మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పినారాయణరెడ్డి ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆజాద్ దేశానికి చేసిన సేవలను తెలుపుతూ అతని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి ఎదగాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, అధ్యాపకులు సుబ్బారాయుడు, నవనీశ్వర్‌రెడ్డి, నరసింహరావ్, శ్రీని వాసులు, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్పదేశ భక్తుడని పలువురు కొనియాడారు. అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తక్వా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠ శాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గౌస్‌లాజం సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ సావిత్రమ్మ, టూటౌన్ సిఐ యుగంధర్ మాట్లాడుతూ పిల్లలకు విద్యతోపాటు నైతిక విలువను బోధించాలన్నారు. మరో ముఖ్య అతిథి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ మనిషిని ఉన్నత స్థానానికి తీసుకెళ్లేది చదువు మాత్రమే అన్నారు. డెంటిస్ట్ సుజాత పిల్లలకు దంత పరీక్షలు చేసి దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. పిల్లలకు వ్యాసరచ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ పాల్గొన్నారు. యంపిజె ఆధ్వర్యంలో డిసి ఎస్‌ఆర్ కాలనీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో కలాం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్‌సలీం మాట్లాడారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

అధైర్య పడకండి.. అండగా ఉంటాం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అధైర్య పడకండి అండగా ఉంటామని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వారి సమస్యలను ఆయనకు విన్నవిం చుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను త్వరగా పరిష్క రించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని, అండగా ఉంటామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

సమస్యలు వింటున్న ఎంపీ

బాలల న్యాయ చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బాలల న్యాయ చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని లీగల్ అధికారి రాజు, సిడిపిఒ సునీత పేర్కొన్నారు. స్థానిక బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం మహిళ శిశు సంక్షేమ శాఖ పీడీ ఆదేశాలు మేరకు బాలల పరిరక్షణ, కిశోర వికాసంపై విద్యార్థులకు న్యాయ సలహాలు, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే విద్యార్థులు ఐసిడిఎస్ అధికారులకుగానీ, 1098 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై కిశోర బాలికలు అవగాహన ఉండాలని కోరారు. యుక్త వయసులో విద్యార్థులు చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని సూచించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, పాఠశాల హెచ్‌ఎం నారాయణమ్మ, అంగన్వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లుల వసూళ్లలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యుత్ బిల్లుల వసూళ్లలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించరాదని విద్యుత్ శాఖ పులివెందుల డివిజన్ రూరల్ ఎడిఇ జయ సుధాకర్‌రెడ్డి సూచించారు. సింహాద్రిపురం విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం మండలంలోని విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సిబ్బంది ఎల్లవేళలా అందు బాటులో ఉండాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు రైతులు ఏదైనా తమ తోటల వద్ద విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే ఫిర్యాదు చేసిన వెంటనే సిబ్బంది స్పందించి పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్లు నాగార్జునరెడ్డి, సుదర్శన, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- పులివెందుల ఆర్‌డిఒ భానుశ్రీ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఆధార్ కేంద్రాల్లో ప్రభుత్వం నిబంధనల ప్రకారం కాకుండా అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల ఆర్‌డిఒ భానుశ్రీ హెచ్చరించారు. సింహాద్రిపురం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ కొన్ని కేంద్రాల నిర్వహకులు అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఆధార్ నమోదు పూర్తిగా ఉచితమన్నారు. బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ అప్డేట్‌కైతే రూ.వంద, డాక్యుమెంట్ అప్డేట్‌కైతే రూ.50, ఇ-ఆధార్ డౌన్లోడ్‌కు రూ.30 చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం ఆమె రికా ర్డులను పరిశీలించారు. తహశీల్దార్ నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ హరిబాబు, సచివాలయ ఆధార్ కేంద్ర నిర్వాహకుడు రవి పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోండి

- ఎపిజిబి ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ రెడ్డి కోరారు. లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సు సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టర్మ్ డిపా జిట్లపై తమ బ్యాంకు అధిక వడ్డీ అందిస్తుందన్నారు. రూపే కార్డు సదు పా యం కూడా ఉందన్నారు. ఈ కార్డు ద్వారా రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యో జన వంటి పథకాలు ఉన్నాయన్నారు. ఏ బ్యాంకు ఖాతాదారుడైన తమ బ్యాం కు వ్యాపార ప్రతినిధి వద్ద ఆధార్ కార్డుతో ఆర్థిక లావాదేవీలు జరు పుకునే అవకాశం కూడా ఉందన్నారు. ఇలా ఎన్నో ఆకర్షణీయమైన పథకాలు ఉన్నా యన్నారు. ఖాతాదారుల శ్రేయస్సే తమ బ్యాంకు ప్రధాన ఉద్దేశమన్నారు.

మాట్లాడుతున్న ఎపిజిబి ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్‌కుమార్ రెడ్డి

కరువు మండలాలు ప్రకటించకపోవడం శోచనీయం : సిపిఎం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లాలో తీవ్రమైన కరువు ఉన్నా కనీసం ఒక్క మండలాన్ని అయినా కరువుగా కూటమి ప్రభుత్వం పక్రటించకపోవడం శోచనీయమని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆ మేరకు సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ.18వేల కోట్లు విద్యుత్ ఛార్జీలను సామాన్య పేద మధ్య తరగతి వారిపై భారాన్ని మోపి కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఉచిత ఇసుక విధానం ఆచరణలో లేదన్నారు. విభజన హామీల అమలు కోసం కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, నాయకులు శీను, చెన్నారెడ్డి, సిఐటియు కార్యదర్శి విజయకుమార్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, నరసింహ, మహేంద్ర పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలతో చర్చిస్తున్న ఎస్‌పి జయరామిరెడ్డి

కార్యకర్తల సమస్యలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం

- టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్‌పి జయరామిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కార్యకర్తల సమస్యలను అధిష్టానం, పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్‌పి జయరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గండి రోడ్డులో ప్రజల సమస్యల వినతులు స్వీకరించేందుకు ఆయన నూతనంగా కార్యాలయాన్ని ప్రారభించారు. అనంతరం అక్కడికి వచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలతో వారి సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై కూడా అధిష్టానానికి తెలియజేస్తామని తెలిపారు. టిడిపి సభ్యత్వాలు అత్యధికంగా చేసేందుకు కృషి చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, మల్లంగి గోపాల్‌రెడ్డి, రామాంజనేయురెడ్డి, రెడ్డి కిషోర్, వార్డు మెంబరు వెంకటేష్, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడం మూర్ఖత్వం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అసెంబ్లీ సమావేశాలకు పులివెందుల శాసనసభ్యులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైసిపి శాసనసభ్యులు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించడం అవివేకం, అజ్ఞానం, మూర్ఖత్వమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి శాసన సభ్యులు చేస్తున్న చర్య ప్రజాస్వామ్య దేవాలయం అసెంబ్లీని అవమానపరచడమే అన్నారు. రాష్ట్ర ప్రజలకు, ఆయా నియోజక వర్గాల ప్రజలకు అన్యాయం చేయడమే అన్నారు. జగన్‌రెడ్డికి ప్రతిపక్ష నాయకుని హోదా ఇవ్వాలంటే అసెంబ్లీ మొత్తం సభ్యుల సంఖ్యలో వైసిపికి 10 శాతం సభ్యులు ఉండాలన్నారు. ఇది తెలిసి కూడా ప్రతిపక్ష నాయకుని హోదా ఇస్తేనే అసెంబ్లీకి హాజరవుతామని చెప్పడం పలాయనవాదమే అవుతుందన్నారు. ఇప్పటికైనా వైసిపి పునరాలోచించుకొని అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని కోరారు. లేదంటే రాజీనామా చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ఘనంగా ఎంపీ పుట్టా మహేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఏలూరు పార్లమెంటు సభ్యులు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తనయుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ జన్మదిన కార్యక్రమాన్ని సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. టిడిపి మండల సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, బిసి సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్, నాగ నాధేశ్వర ఆలయ చైర్మన్ గంగవరం ఆది నారాయణ రెడ్డి, రాజమోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగ నాధేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవం.. కోదండరామ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని కత్తులూరు పంచాయతీ తాటిమాకులపల్లె గ్రామంలో కోదండరామస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం, సాయంత్రం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 12న సీతారామ లక్ష్మణా విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేయనున్నట్లు తెలిపారు. రాత్రి కోలాటం, చెక్క భజన ఉంటుందన్నారు. 13న ఉదయం విగ్రహ ప్రతిష్ట, అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

భక్తులతో నిండిన శైవక్షేత్రాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

రెండో కార్తీక సోమవారం సందర్భంగా శివాలయాలన్ని భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజామున నుంచే మహిళలు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని దీపాలు వెలిగించి, పూజలు చేశారు. మండల పరిధిలోని పుల్లూరు సమీపంలో నాగనాథేశ్వర ఆలయం, స్థానిక అగ్రహారంలో శివాలయం, స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని శివ భక్తేంద్ర ఆలయాల్లో శివుడికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. నాగ నాథేశ్వర కోనలోని కాశినాయన ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎడ్ల పందాలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గంగవరం ఆదినారాయణరెడ్డి, సుమన్ పాల్గొన్నారు.

చాపాడు : అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో రెండవ కార్తీక సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. వీరభద్రస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రం, ఆర్యవైశ్య సర్వజన అన్నదాన సత్రాల్లో అన్నదాన చేశారు. సర్వజన అన్నదాన సత్రంలో బెంగళూరు వాస్తవ్యులు భద్రిపల్లె గ్రామానికి చెందిన గుత్తి వీరాభిషేకం అన్నదానానికి సహకరించారు. కార్యక్రమంలో ఇఒ మారుతి ప్రసాద్, గ్రామ పెద్దలు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీదేవి కార్తీక మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరీదేవి కార్తీక మహోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ అధ్యక్షులు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పలు పూజలు చేశారు. గౌరిదేవిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలతోపాటు ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదారుల పూజలు అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారు రాత్రి రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 9 గంటలకు కవి డాన్స్ మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో మ్యూజికల్ షో, నృత్య ప్రదర్శన అలరించాయి. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, ఆరు షేర్ల రంగయ్య, ఉపాధ్యక్షులు రామచంద్ర, ఎడాల రామా, మహిళా మండలి అధ్యక్షురాలు కొత్తూరు రత్నాలు, నిర్వాహకులు రాజారాం, లక్ష్మీనారాయణ, జగన్మోహన్, నామా శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ప్రతి విద్యార్థి పౌష్టికాహారం తీసుకోవాలని నేత్ర వైద్యాధికారి కెజె రఘు రామిరెడ్డి సూచిం చారు. చాపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం ఆయన కడప జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వ ర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 మందికి దృష్టిలోపం ఉందన్నారు. కంటి అద్దాలు ఉచితంగా అందించే ఏర్పాటు చేశారు. అన్ని పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు చేసి అందరికీ అద్దాలు, మందులు, ఆపరేషన్ అవసరం అయితే ఉచితంగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.నాగలక్ష్మి, సిహెచ్ఒ శృతి, ఏఎన్‌ఎం సునీత, ఆశా కార్యకర్తలు పెర్షి, వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్ష చేస్తున్న రఘురామిరెడ్డి